క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి రూరల్: మండలంలోని ఆర్ఎల్ పురం, సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో 33 కేవీ విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఎల్ పురం, సబ్ స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్స్‌కు, రామతీర్థం గ్రామాలకు గృహ, గృహేతర వినియోగదారులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలి కోరారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని పేర్నమిట్ట, ఎండ్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. పేర్నమిట్ట, ఎండ్లూరు, మైనంపాడు, చలప్పాలెం, తదితర గ్రామాలకు గృహ, గృహేతర వినియోగదారులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

కొత్తపట్నం: మండలంలో సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని హైదరాబాద్ నుంచి వచ్చిన ఇక్రిషట్, తేరి సంస్థ బృందం శుక్రవారం పరిశీలించింది. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి ఆధ్వర్యంలో వజ్జిరెడ్డిపాలెం, కొత్తపట్నంలో పరిశీలించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడులోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారిణి పావని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూమాత ఫెర్టిలైజర్స్ షాపులో ఎరువులు, పురుగుమందులను తనిఖీ చేసి సరైన పత్రాలు చూపించని కారణంగా రూ.88,800 విలువైన ఎంటీపీ ఎరువు మూడు టన్నుల అమ్మకాలను నిలిపివేశారు. నాణ్యతా పరీక్షల కోసం ఎరువులు, పురుగుమందుల శాంపిల్స్‌ను ల్యాబ్‌కి పంపించారు.



డీఎస్ కళాశాలలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు



అన్నమయ్య, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న రచయితలు, సాహిత్యవేత్తలు



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న రచయితలు, కవులు, సాహిత్యవేత్తలు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ఒంగోలు మెట్రో: తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎర్రన్న సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ ఆఫీసు ప్రాంగణంలో ఎర్రన్న విగ్రహానికి నివాళులర్పించారు. పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, పద్య సారస్వత పరిషత్ కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు అగస్త్యరాజు శివసుబ్రహ్మణ్యం, స్వర్ణ మల్లికార్జునరావు, ఆగిరేకు గురవయ్య, పిన్నమ్మరాజు నరసింహారావు, సురపరాజు రాము పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో...

గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర మాంటిస్సోరి స్కూల్ పక్కన ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సాహిత్యవేత్తలు, కవులు, రచయితలు పాల్గొని తెలుగుతల్లి, శ్రీకృష్ణదేవరాయలు, అన్నమయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావును సన్మానించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, కొండారెడ్డి, కేఎస్వీ ప్రసాదు, సయ్యద్ ఇస్మాయిల్, పింగళి పూర్ణచంద్రరావు, పెళ్లూరు వెంకటేశ్వర్లు, కరవది సుబ్బారావు, రచయితలు, భాషాభిమానులు పాల్గొన్నారు.



బండ్లమిట్ట హైస్కూల్లో నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు



గుండ్లాపల్లి జెడ్పీ హైస్కూల్లో పోటీల్లో గెలుపొందిన గ్రూప్‌నకు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీ అందిస్తున్న హెచ్ఎం ప్రభాకర్, గ్రామ పెద్దలు

కళామిత్ర మండలి ఆధ్వర్యంలో...

గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా ఒంగోలు కర్నూల్ రోడ్డు జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు డాక్టర్ నూనె అంకమ్మరావు ఆధ్వర్యంలో తెలుగు తల్లి విగ్రహానికి నివాళులర్పించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న ఎర్రన, జాషువా విగ్రహాలను పూలమాలలతో అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. నారాయణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, కుర్రా ప్రసాద్ బాబు, సాహితీవేత్త డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, కవి నన్నపనేని రవి, మిడసల మల్లికార్జున రావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కవులను సత్కరించారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం షణ్ముగం ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్, స్కూలు కమిటీ చైర్మన్ సీహెచ్ రమేష్, తదితరులు పాల్గొని గిడుగు రామమూర్తి చిత్రపటంతో పాటు హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ఆలపించిన పాటలు తోటి విద్యార్థులను అలరించాయి.

మద్దిపాడు మండలంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం...

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో పీడీలు మాధవి, బాబి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులతో 8 హౌస్‌లు ఏర్పాటు చేసి జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు రకాల ఆటల పోటీలను గత వారం రోజుల నుంచి నిర్వహించారు. వ్యక్తిగత విభాగాలలో బహుమతులు సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందించారు. అనంతరం చదువులో, ఆటలలో, ఇతర నైపుణ్యాలైన చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, ఇంగ్లిష్ స్పీకింగ్, తదితర అంశాలలో నిర్వహించిన పోటీల్లో వచ్చిన పాయింట్ల ఆధారంగా ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను పీవీ సింధు హౌస్ గెలిచినట్లు ప్రకటించి వారికి కప్ అందజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన స్కూల్ కమిటీ చైర్మన్ రవి, గ్రామ పెద్దలు సంజీవరెడ్డి, శివరామకృష్ణారెడ్డి, సత్యన్నారాయణరెడ్డి చేతుల మీదుగా కప్ అందించారు. బాలుర విభాగంలో సీవీ రామన్ హౌస్ వారు ప్రథమ స్థానంలో నిలిచారు. ముందుగా తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి, క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా ఇనమనమెళ్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లోనూ తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

బండ్లమిట్ట హైస్కూల్లో...

ఒంగోలు సిటీ: స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జి.కృష్ణకుమారి అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఒంగోలు డీవైఈఓ చంద్రమౌళేశ్వరరావు, మార్కాపురం డీవైఈఓ మామిళ్లపల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొని తెలుగుభాష గొప్పతనం గురించి వివరించారు. నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు.

డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో...

ఒంగోలు సిటీ: స్థానిక దామచర్ల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కుసుమకుమారి ఉపాధ్యక్షులుగా, విద్యార్థులకు నిర్వహించిన పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. తెలుగు అధ్యాపకురాలు పి.యామిని అమ్మాజీ, డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఏవీ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలు ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఎర్రన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎర్రన్న సాహిత్య పరిషత్ సభ్యులు



చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న హెచ్ఎం షణ్ముగం, డాక్టర్ జవహర్, రమేష్

భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రులు



ఒంగోలు ప్రగతినగర్‌లో వినాయక మండపంలో భజనలో పాల్గొన్న మహిళలు



కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో...


ఒంగోలు మెట్రో/చీమకుర్తి రూరల్: ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో గణపతి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఒంగోలు నగరంలోని వీధివీధిలో భారీ గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గణపతి ఆశీసులు అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. సంతనూతలపాడులోని పలు ప్రాంతాల్లో 25కుపైగా వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి ఘనంగా పూజలు చేస్తున్నారు.



గోపాలనగర్ 4వ లైన్‌లో...



ఈమనిపాలెం రాధాకృష్ణుడి ఆలయం వద్ద వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు



ద్వారకానగర్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ విగ్రహం



రామ్‌నగర్ 4వ లైన్‌లో..



గోపాలనగర్ 1వ లైన్‌లో శేషపాన్పుపై ఆశీనుడైన గణనాథుడు

బీజేపీ పాలనలో ప్రమాదంలో పడిన దేశం



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యుడు జేమ్స్

ఒంగోలు టౌన్: వందేళ్ల చరిత్ర కలిగిన ఫాసిస్టు సంస్థ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పని చేస్తున్న బీజేపీ పాలనలో దేశం గతంలో ఎన్నడూ లేనంతగా ప్రమాదంలో పడిపోయిందని సీపీఎంఎల్ రెడ్ స్టార్ కేంద్ర కమిటీ కార్యదర్శి పీజే జేమ్స్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం సీవీఎన్ రీడింగ్ రూంలో వర్తమాన రాజకీయాలు–ప్రజా ఉద్యమాలు అనే అంశం మీద నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధి వేదిక జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు మాట్లాడుతూ హక్కుల కోసం ఉద్యమిస్తున్న రైతులు, సామాన్య ప్రజల మీద అణచివేత ధోరణి అవలంబిస్తున్నారని చెప్పారు. సీపీఎంఎల్ రెడ్‌స్టార్ పొలిట్‌బ్యూరో సభ్యుడు మన్నవ హరిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం పేదల భూములపై కన్నేసిందని, వేలాది ఎకరాల భూములను అభివృద్ధి పేరుతో సేకరించి కార్పొరేట్లకు కట్టబెడుతుందని విమర్శించారు. సదస్సులో కొల్లిపరి వెంకటేశ్వరరావు, రెబ్బవరపు ఉదయ్, రంగనాథం మాట్లాడగా, పేరయ్య, దాసరి సుందరం, ఎం జార్జ్, సుబ్బారావు, పేరం సత్యం, ఆవుల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పోతురాజు

కొత్తపట్నం: మండల ప్రజలను నూరు శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఉల్లాస్–అక్షరాంధ్ర –అక్షరాస్యత అనే కార్యక్రమం ప్రవేశ పెట్టినట్లు వయోజన విద్య డివిజినల్ సూపర్‌వైజర్ టి.పోతురాజు తెలిపారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో శుక్రవారం వీఓఏలు, వలంటరీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పాఠశాల స్థాయిలో బడి మానేసి ప్రస్తుతం 15 నుంచి 59 సంవత్సరాల వయసు వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఏపీఓ కొక్కిలగడ్డ నాగరాజు, వీఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ నేత్రదానం చేయాలి



నేత్రదానం గురించి వివరిస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్ జయరాజ్, వైద్యశాఖ సిబ్బంది

మద్దిపాడు: ప్రతిఒక్కరూ నేత్రదానం చేయాలని ఆప్తాల్మిక్ అధికారి జయరాజ్ కోరారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం మద్దిపాడులోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మరణించిన తర్వాత 6 నుంచి 8 గంటలలో దగ్గరలోని డాక్టర్ నేత్రాలను సేకరించి అర్హులైన వారికి వాటిని ఉపయోగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లలితమ్మ, సూపర్‌వైజర్ బాలకోటయ్య, హెచ్‌వీ నాగరాజి, వైద్యశాఖ సిబ్బంది, పలువురు నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్ సేవలు మరువలేనివి

- ఏకేయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలామణి

ఒంగోలు సిటీ: హాకీ మాంత్రికుడు, భారత మాజీ మేజర్ ధ్యాన్‌చంద్ భారతావనికి అందించిన సేవలు మరువలేనివని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం హెచ్ఓడీ ప్రొఫెసర్ ఎస్.నిర్మలామణి అన్నారు. స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్సిటీ కళాశాల ప్రాంగణంలో మేజర్ ధ్యాన్ చంద్ 120వ జయంతి వేడుకల్లో భాగంగా 'జాతీయ క్రీడా దినోత్సవాన్ని' వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీఈ, డీఓఏ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.సోమ శేఖర, డీన్ అకాడమిక్స్ డాక్టర్ కే.గంగాధర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ హర్షప్రీతమ్ దేవ్‌కుమార్, వ్యాయామ విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ సయ్యద్ ఆశీఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్విస్ కళాశాలలో క్రీడా దినోత్సవం

ఒంగోలు సిటీ: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల యాజమాన్యం ప్రోత్సాహక బహుమతులు అందజేసింది. కళాశాలలోని క్రీడాకారులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులంతా ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి, తదితరులు పాల్గొని తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు వెంకట రామ్మూర్తికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు, ఫిజికల్ డైరెక్టరీ విభాగం వారు పాల్గొన్నారు.



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ నిర్మలామణి

క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ టోర్నమెంట్

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం హాకీ టోర్నమెంట్ నిర్వహించారు. డైట్ ప్రిన్సిపాల్ సుబ్బారావు ప్రారంభించగా, హెడ్ మాస్టర్ నరసింహారావు అధ్యక్షత వహించారు. హాకీ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు చంద్రమౌళేశ్వర్, శ్రీనివాసరెడ్డి, డీఎస్‌డీఓ రాజరాజేశ్వరి, జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి సుందరరామిరెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు, చంద్రశేఖర్, రాజు, వనజ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

జేసీ విస్తృత తనిఖీలు

మద్దిపాడు: మండలంలోని పెట్రోల్ బంకు, రేషన్ షాపు, ఎరువుల దుకాణం, సినిమా థియేటర్‌ను జేసీ గోపాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ముందుగా సీతారాంపురంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేసి పలు అంశాలను పరిశీలించారు. అనంతరం మద్దిపాడులోని రేషన్ షాపును పరిశీలించి వృద్ధుల ఇంటికి వెళ్లి రేషన్ అందించారు. అనంతరం వెల్లంపల్లిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని పరిశీలించి యూరియా ఎక్కడైనా ఎక్కువ ధరకు అమ్ముతున్నారా..? అనే విషయంపై ఆరా తీశారు. వెల్లంపల్లిలోని జేఎంఆర్ థియేటర్‌ను పరిశీలించి ప్రేక్షకులకు కల్పిస్తున్న సౌకర్యాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. జేసీ వెంట జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు, డీటీ అజయ్, ఏఓ స్వర్ణలత, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖాధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో తహసీల్దార్ తనిఖీలు...



సంతనూతలపాడులో గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్, రేషన్ షాపులను తహసీల్దార్ నారాయణరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని మైనంపాడు, తదితర గ్రామాల్లో రేషన్ షాపులను, రైస్ మిల్లులను, సంతనూతలపాడులోని అయ్యప్ప ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ, గోడౌన్, గంగవరం, సంతనూతలపాడులో పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.